

డిసెంబర్ నాటికి.. పూర్తయ్యేనా?

కరివెన రిజర్వాయర్ వరకు పీఆర్ఎల్ఐ పూర్తిచేసేందుకు ప్రణాళికలు



నిర్మాణంలో ఉన్న కరివెన రిజర్వాయర్

దాదాపు 3 లక్షల ఎకరాల ఆయకట్టుకు లబ్ధి

- ఉమ్మడి జిల్లా సమీక్షలో సీఎం ఆదేశించినట్లు ముందుకు సాగని పనులు
- ఉదండాపూర్‌కు 2027 మార్చి డెడ్‌లైన్, వేధిస్తున్న పరిహారం సమస్య
- మిగతా పెండింగ్ ప్రాజెక్టుల పనులు ఎక్కడివక్కడే, పురోగతి శూన్యం

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు నిర్దేశించిన గడువు సమీపిస్తున్నా పనులు ఆశించిన స్థాయిలో జరగడంలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా ప్రాజెక్టుల నిర్మాణ పనుల పూర్తికి అధికారుల సమీక్షలో సూచించిన పురోగతి లేదు. ఇందుకు నిధుల కొరత కూడా కారణం అవుతోంది. జిల్లాలో ప్రధానమైన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్ఎల్ఐ)లో కరివెన రిజర్వాయర్‌ను వచ్చే డిసెంబరు నాటికి పూర్తిచేయాల్సి ఉన్నా పనులు ఆశాజనకంగా సాగడంలేదు. మిగిలిపోయిన మిగతా సాగునీటి ప్రాజెక్టుల పనులు కూడా అదేవిధంగా ఉన్నాయి.

మహబూబ్‌నగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అత్యంత కీలకమైన ప్రాజెక్టుగా భావిస్తున్న పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో మెజారిటీ పనులను పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరు డెడ్‌లైన్ పెట్టుకున్నది. ఆరు నెలల్లోపు కరివెన రిజర్వాయర్ వరకు పనులు పూర్తిచేసి ఆయకట్టు పరిధిలోని దాదాపు 3 లక్షల ఎకరాలకుపైగా నీరివ్వాలని నీటిపారుదల శాఖ ప్రణాళికలు చేసుకున్నది. అయితే ఆలోపు పనులు పూర్తిచేసి నీరివ్వడానికి అంతా అనుకున్నట్లు జరగాలి. గత ప్రభుత్వ హయాంలోనే పాలమూరు- రంగారెడ్డిని 90 శాతం పూర్తిచేశామని చెప్పుకున్నప్పటికీ ఈ రోజుకూ ఆయకట్టుకు నీరందించలేని పరిస్థితి ఉన్నది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నార్లాపూర్ వద్ద ఒక మోటార్‌ను ప్రారంభించి ప్రాజెక్టును పూర్తిచేశామని ప్రకటించారు. వాస్తవానికి అది ఎన్నికల ఎత్తుగడగానే మిగిలిపోయింది. అయితే నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివెన రిజర్వాయర్ల పనులు మెజారిటీగా పూర్తయ్యాయి. పంప్‌హౌజ్‌లు, మోటార్ల బిగింపు కూడా కొలిక్కి వస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి గత సంవత్సరం ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టుల సమీక్ష సందర్భంగా పాలమూరు- రంగారెడ్డిని మూడేళ్లలోపు పూర్తిచేస్తామని ప్రకటించారు. అయితే దశలవారీగా ముందుకెళ్తే ఉన్న నిధులను సమర్థవంతంగా

(మిగతా 6లో..)

వేగంగా సాగుతున్న పనులు..

నార్లాపూర్ నుంచి మొదలుకొని ఏదుల వరకు టన్నెల్‌తో పాటు గ్రావిటీ కెనాల్ కూడా తీయాల్సి ఉంది. గతంలో టన్నెల్ పనులను దాదాపు పూర్తిచేసినప్పటికీ గ్రావిటీ కెనాల్ పనులు పూర్తిచేయలేదు. ప్యాకేజీ-3లో భాగంగా 8.325 కిలోమీటర్ల కెనాల్‌లో కొంత పూర్తికాగా చాలా వరకు పెండింగ్‌లో ఉన్నది. ఆ పనులకు ఇప్పుడు వేగం పెంచారు. ప్యాకేజీ-7లో భాగంగా ఏదుల నుంచి వట్టెం వరకు 19 కిలోమీటర్ల టన్నెల్ పూర్తికాగా పెండింగ్ లైనింగ్ పనులు, గ్రావిటీ కెనాల్ పనులు కొంతమేర పెండింగ్‌లో ఉన్నాయి. నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివెన రిజర్వాయర్ల పనులు దాదాపు ఇప్పటికే పూర్తయ్యాయి. అలాగే ఈ ప్రాజెక్టు మొత్తం 189 ప్యాకేజీలుగా విభజించి పనులు చేపట్టగా ప్రస్తుతం కరివెన వరకు రిజర్వాయర్లు పూర్తయ్యాయి. ప్యాకేజీ 1,5,8 లో భాగంగా పంప్‌హౌస్‌లలో మోటార్ల బిగింపు కూడా పూర్తయ్యింది. సబ్ స్టేషన్ రీచార్జి, మోటార్ల డ్రై రన్ కూడా అప్పట్లోనే పూర్తయ్యింది. నార్లాపూర్‌లో నాలుగు, ఏదుల, వట్టెంలో ఐదు చొప్పున మోటార్లు సిద్ధంగా ఉన్నాయి. గతేడాది కురిసిన వర్షాలకు వట్టెం పంప్‌హౌజ్ మునిగిపోగా నాలుగు మోటార్లు దెబ్బతిన్నాయి. వీటికి మరమ్మతు చేయడంతో పాటు మరో మోటార్‌ను ఏర్పాటు చేశారు. నార్లాపూర్ నుంచి ఉదండాపూర్ వరకు రిజర్వాయర్లలో కరివెన వరకు నీరందించి ఉదండాపూర్ రిజర్వాయర్ పూర్తికి 2027 మార్చి డెడ్‌లైన్‌గా పెట్టుకున్నారు. అక్కడ పరిహారం రూ. 800 కోట్లు అవసరం ఉండగా ఇప్పటివరకు రూ. 72 కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. రిజర్వాయర్ నిర్మాణంలో భూమి కోల్పోయిన వారు, ఇళ్లు కోల్పోయిన వారు మరింత పరిహారం ఆశిస్తున్నారు. భారీగా నిధులను వెచ్చిస్తే తప్పా పరిస్థితి కొలిక్కి వచ్చే అవకాశం లేదు.



రిజర్వాయర్ వద్ద ఎక్స్‌కవేటర్‌తో చేపడుతున్న పనులు

సీఎంను కలిసిన మంత్రి శ్రీహరి కుటుంబం



ముఖ్యమంత్రి రేవంత్‌తో మంత్రి శ్రీహరి, కుటుంబ సభ్యులు

మక్తల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మంత్రి వాకిటి శ్రీహరి, కుటుంబ సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సీఎంను శాలువాతో సన్మానించారు. అనంతరం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీహరి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, సహచర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి వెంట భార్య లలిత, కుమారులు అచ్యుత్‌రామ్, అనిత్ సాయిరాజ్ ఉన్నారు.

లైంగిక వేధింపులను కమిటీ దృష్టికి తేవాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాలు లేదా సంస్థల్లో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులపై కమిటీ సభ్యులకు ఫిర్యాదు చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. అనంతరం జిల్లా అధికారులతో సమావేశం అయ్యారు. మహిళలపై లైంగిక వేధింపులు, రాజీవ్ యువవికాస పథకం, ప్రొక్యూర్‌మెంట్, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, శానిటేషన్ తదితర అంశాలపై సమీక్షించారు. ప్రభుత్వ కార్యాలయంలో లేదా ఒక సంస్థలో 10 మంది కంటే ఎక్కువ, లేదా కనీసం ముగ్గురు మహిళలు పనిచేస్తుంటే ఇంటర్నల్ ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. వేధింపులు ఎదుర్కొంటే కమిటీకి ఫిర్యాదు చేయవచ్చన్నారు. లేదా ఐసీడీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్స్‌లో కూడా రాసి, వేయొచ్చని తెలిపారు. ఫిర్యాదును గోప్యంగా ఉంచి, రహస్యంగా విచారణ చేసి వారిపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకంపై మాట్లాడుతూ 4 కార్పొరేషన్ సెక్టార్‌లకు సంబంధించి ఇదివరకే హార్డ్ కాపీలను ఇచ్చినట్లు చెప్పారు. అందుకు ప్రొసిడింగ్‌లను సిద్ధం చేయాలని సూచించారు. ఈ నెల 12న ఎస్సీ కమిషన్ జిల్లాను విజిట్ చేయనుందని, సంబంధిత శాఖల అధికారులు ప్రిపరేషన్ చేసుకోవాలని ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించి, వాటి స్థితిగతులను విద్యుత్ అధికారులకు తెలపాలని, వర్షాలు కురుస్తున్నందున శానిటేషన్‌పై దృష్టి పెట్టాలని, క్లోరినేషన్ చేయాలని చెప్పారు. ప్రజావాణికి 96 ఫిర్యాదులు వచ్చాయి.

అధునాతన వసతులతో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లు

- రూ.2 కోట్లతో నిర్మాణం
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జూన్9 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక హంగులతో వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్‌లను అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రూ.2 కోట్లతో పాతతోటలో నిర్మించనున్న మార్కెట్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీలైనంత త్వరలో పనులు పూర్తిచేసి, ప్రజలకు మార్కెట్‌లను అందుబాటులోకి తెస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ స్థలం సరిపోవడం లేదని, దీనివల్ల రైతులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. అందుకే అన్ని వసతులతో మంచి మార్కెట్‌ను నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, నాయకులు సీజే బెనహర్, చిన్న, ప్రశాంత్, పాష, అంజద్, ఉమర్, లక్ష్మణ్, రఘు, అజ్మత్ పాల్గొన్నారు.

రూ.4 కోట్లతో బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులు: నగరంలోని 25వ వార్డు గోల్‌మజీద్‌లో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిధులు రూ.4 కోట్లతో నిర్మించనున్న బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలమూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. ఏడాది కాలంలోనే నగరంలో రూ.250 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అందులో చాలావరకు పూర్తయ్యాయని, మిగతావి నిర్మాణ దశలో ఉన్నాయన్నారు.

గంజాయ్

మత్తులో యువత చిత్తు

- హైదరాబాద్‌లోని ధూల్‌పేట నుంచి దిగుమతి
- రైలుమార్గం ద్వారా సరఫరా
- 5 గ్రాముల ప్యాకెట్ రూ.300- రూ.500లకు విక్రయం
- తీసుకుంటున్న వారిలో విద్యార్థులు, ఉద్యోగులు
- చర్యలు తీసుకుంటున్నా ఫలితం అంతంతే

6



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గంజాయి వాసన గుప్పుమంటోంది. హైదరాబాద్‌లోని ధూల్‌పేట నుంచి దానిని తెచ్చి, యువతకు అంటగడుతున్నారు. దానికి బానిసలైన వారు జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. మత్తులో దొంగతనాలకు పాల్పడటంతో పాటు లైంగిక దాడులకు దిగుతున్నారు. ఒంటిమీద సోయిలేకుండా ఏం చేస్తున్నారో వారికే తెలియని పరిస్థితి ఉంటోంది. గంజాయి తీసుకుంటున్న వారిలో డాక్టర్లు, పోలీసుల కుమారులు కూడా ఉండటం గమనార్హం.

- మహబూబ్‌నగర్

భారత్‌పై అమెరికా పెత్తనం ఏంటి?

- పార్టీ జోగులాంబ గద్వాల జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

7

కోయిల్‌సాగర్‌కు చేరుతున్న జూరాల నీరు

- ప్రాజెక్టులో పెరుగుతున్న నీటిమట్టం
- సోమవారం సాయంత్రం వరకు 12.5 అడుగులకు చేరిక

7

పాత కక్షలతో వ్యక్తిపై దాడి

7

- తీవ్రంగా గాయపడి మృతి
- నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరులో ఘటన

పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ

- స్థల ధ్రువీకరణ పత్రాల సృష్టి
- ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో వెలుగులోకి

7

పెరగనున్న యూనివర్సిటీ ప్రతిష్ట

- రేపటి నుంచి టీజీ పీఈసెట్ ఎంపికలు
- పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

6

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

మక్తల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకొని చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు నారాయణపేట డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. పట్టణంలోని సీఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మక్తల్ మండలం జక్లేర్ గ్రామానికి చెందిన సబ్బంగారి విష్ణువర్ధన్‌రెడ్డి గత ఏడాది నవంబరు 11న ఓ వివాహానికి వెళ్లి వచ్చే సరికి ఇంట్లో దొంగలు పడి నగదు, నగలు దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి విచారణ చేపట్టారు. పట్టణంలోని క్రాస్‌రోడ్‌లో ఆదివారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. వారిని చూసి ఇద్దరు వ్యక్తులు పారిపోతుండగా పోలీసులు వెంటాడి పట్టుకొని విచారించారు. వారు కర్ణాటక రాష్ట్రంలోని సింధనూరుకు చెందిన మహ్మద్ గౌస్, రాయచూరు జిల్లా దేవదుర్గం గ్రామానికి చెందిన హనుమంతప్పగా గుర్తించారు. వారు తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి చోరీలకు పాల్పడుతున్నట్లు తేలింది. వారిని అరెస్టు చేసి, రూ.4.5 లక్షల విలువైన ఐదు తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు. చాకచక్యంగా కేసు ఛేదించిన సీఐ రాంలాల్, ఎస్ఐలు భాగ్యలక్ష్మీరెడ్డి, నవీద్, క్రైమ్ పోలీసులు అశోక్, శ్రీకాంత్, నరేశ్, శశిలను డీఎస్పీ అభినందించారు.

పాఠ్య పుస్తకాలు సిద్ధం చేయాలి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట టౌన్, జూన్ 9, (ఆంధ్రజ్యోతి): పాఠశాలల పునఃప్రారంభం నాటికి పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు సరఫరా చేయాలని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. విద్యా, డీఆర్డీఏ, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో కొనసాగుతున్న పనుల ప్రగతిపై కలెక్టర్ సోమవారం తన చాంబర్‌లో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేజీబీవీ సిబ్బందికి శిక్షణ పూర్తయ్యిందా? అని డీఈవో గోవిందరాజులును అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో బడిబాట కార్యక్రమంలో ఎంత మంది పిల్లలు నమోదు అయ్యారని అడుగగా, ఇప్పటి వరకు 349 మంది నమోదు అయ్యారని డీఈవో చెప్పారు. వారిలో 37 మంది వివిధ ప్రైవేటు పాఠశాలల నుంచి ఉన్నారన్నారు. మండలాల వారీగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు ఎంత సరఫరా చేశారో నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా మహిళా సమాఖ్య భవన నిర్మాణ పనులను మరింత వేగంగా పూర్తి చేసి, నిర్ణీత గడువు నవంబరు లోపు ప్రారంభానికి సిద్ధం చేయాలని పీఆర్ఈఈ హీర్యానాయక్‌కు చెప్పారు. సోలార్ పవర్ పాయింట్ల కోసం గుర్తించిన ప్రభుత్వ భూముల వివరాల గురించి డీఆర్డీఏ మొగులప్పను అడిగారు. జిల్లాలో సదరం స్లాట్ల పెండింగ్‌పై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేయాలని డీఆర్డీఏకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ పాల్గొన్నారు.

టీపీసీసీలో పాలమూరుకు ప్రాధాన్యం

- కమిటీలో ఆరుగురికి చోటు

మహబూబ్‌నగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలో ఉమ్మడి పాలమూరుకు ప్రాధాన్యం లభించింది. ఆరుగురికి అవకాశం కల్పిస్తూ సోమవారం రాత్రి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. జాబితా వెలువడే సమయానికి సీఎం రేవంత్ కూడా ఢిల్లీలోనే ఉండటం గమనార్హం. టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, మహబూబ్‌నగర్ నుంచి సంజీవ్‌ముదిరాజ్, ఏపీ మిథున్‌రెడ్డి, వనపర్తి నుంచి నందిమల్ల యాదయ్య ముదిరాజ్, గద్వాల నుంచి రాజీవ్‌రెడ్డిలకు అవకాశం లభించింది.

గంజాయ్

మత్తులో యువత చిత్తు

- హైదరాబాద్‌లోని ధూల్‌పేట నుంచి దిగుమతి
- 5 గ్రాముల ప్యాకెట్ రూ.300-రూ.500లకు విక్రయం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విక్రయాలు

● రెండేళ్ల క్రితం మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేసిన ఎక్సైజ్ పోలీసులు వారిని విచారించగా, డాక్టర్లు కూడా కస్టమర్లుగా ఉన్న విషయం తెలుసుకుని నిర్ఘాంతపోయారు. కస్టమర్లుగా ఉన్న సదరు డాక్టర్లను పిలిచి కౌన్సెలింగ్ చేస్తే తాము ఒత్తిడి తట్టుకునేందుకు గంజాయి తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

● కొన్నాళ్ల క్రితం మహబూబ్‌నగర్‌లోని ఓ కళాశాల మైదానంలో గంజాయి తీసుకుంటున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా, అందులో ఒకరు కానిస్టేబుల్ కొడుకు కాగా, మరొకరు విద్యార్థి ఉన్నారు. ఓ వర్గానికి చెందిన విద్యార్థులు ఎక్కువగా గంజాయికి అలవాటు పడుతున్నారు. మైదాన ప్రాంతాలు, చెట్లపొదలే అడ్డాలుగా చేసుకుని గంజాయి సేవిస్తున్నారు.


గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన వ్యక్తులు (ఫైల్)

మహబూబ్‌నగర్, జూన్9 (ఆంధ్రజ్యోతి): యువతను గంజాయి మత్తు పట్టి పీడిస్తోంది. మత్తుకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గంజాయి తీసుకుంటున్న వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. హైదరాబాద్ నుంచి పాలమూరుకు రైలు మార్గం ద్వారా గంజాయి సరఫరా అవుతోంది. ఉమ్మడి జిల్లాలోని అన్ని పట్టణాలు, కొన్ని మండల కేంద్రాల్లో గంజాయి విక్రయాలు సాగుతున్నాయి. రెగ్యులర్ కస్టమర్లకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మహబూబ్‌నగర్ నగరంలోని మోతీనగర్ అడ్డాగా విక్రయాలు జరుగుతున్నాయి. అక్కడే రైల్వే స్టేషన్ ఉండటంతో చుట్టూ ఉండే కాలనీలకు చెందిన పలువురు వ్యక్తులు, ఆటోడ్రైవర్లు దూల్‌పేట నుంచి ప్యాకెట్ల రూపంలో రూ.100-200కు కొనుగోలు చేసి, ఇక్కడ రూ.300-500 వరకు విక్రయిస్తున్నారు. వారు తీసుకోవడంతో పాటు అలవాటున్న రెగ్యులర్ కస్టమర్లకు విక్రయిస్తున్నారు. గంజాయి పొడిని తెల్లటి సిల్వర్ కవర్‌లో చుట్టలా చేసుకుని సేవిస్తున్నారు. హాష్ ఆయిల్‌ను డ్రాప్స్ సిగరెట్‌లో వేసుకుని తీసుకుంటున్నారు. గంజాయికి అలవాటు పడిన వాళ్లు మత్తులో ఏం చేస్తున్నారో వాళ్లకే తెలియని పరిస్థితి ఉంటుంది. నేరాలకు సైతం పాల్పడుతున్నారు. లైంగికదాడులు, దొంగతనాలు వంటివి చేస్తున్నారు. యువత దానిని తీసుకుని శారీరకంగా బలహీనులవుతున్నారు.

ఒంటిమీద సోయి లేకుండా ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పునరావాస కేంద్రాలు లేకపోవడంతో పట్టుబడిన వారికి ఆ పూట కౌన్సిలింగ్ చేసి వదిలేయడం వల్ల ఫలితాలు ఉండటం లేదు. పునరవాస కేంద్రాలలో వారం కౌన్సెలింగ్ చేసి, 15 రోజులు పరిశీలనలో ఉంచితే బానిసలైన వారిలోనూ మార్పు ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

కొన్ని ఘటనలు..

● గతేడాది అక్టోబరులో జిల్లా కేంద్రంలోని పిస్తాహౌస్ దగ్గర రూ.25 లక్షలు విలువ చేసే 5 కిలోల హాష్ ఆయిల్‌ను పట్టుకున్నారు. ఒరిస్సా మీదుగా ఇద్దరు వ్యక్తులు రాయిచూర్‌కు ఆ ఆయిల్ తరలిస్తుండగా స్టేట్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందాలు పట్టుకున్నాయి. దీనిని సిగరెట్‌లో 2 చుక్కలు వేసుకుని గంజాయిలా తీసుకుంటారు.

● గతనెల పక్కా సమాచారం మేరకు బోయపల్లి గేట్ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ దగ్గర గంజాయి విక్రయిస్తున్నారని ఎక్సైజ్ పోలీసులు ఆ ప్రాంతంలో నిఘా ఏర్పాటు చేశారు. నగరంలోని షాషాబ్‌గుట్టకు చెందిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 350 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నలుగురుని అరెస్ట్ చేశారు. మరొకరు పరారీలో ఉన్నారు.

● గద్వాల జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ సమీపంలో గత నెల ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద 650 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గతేడాది ఇదే జిల్లా ఉండవల్లిలో హైదరాబాద్‌కు చెందిన ఏడుగురు వ్యక్తులు గంజాయి విక్రయిస్తుండగా వారిని పోలీసులు అరెస్ట్ చేసి, 18 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

● మక్తల్‌లో గతేడాది 2 కేసుల్లో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద 500 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మద్దూర్ మండలంలో 1.3 కిలోల ఎండు గంజాయి, 89 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు.

● వనపర్తిలోనూ రెండు కేసుల్లో 207 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్ట్ చేశారు.

పెరుగనున్న యూనివర్సిటీ ప్రతిష్ట

- ఈనెల 11 నుంచి టీజీ పీఈసెట్ ఎంపికలు
- ప్రారంభించనున్న ఉన్నత విద్యామండలి చైర్మన్
- పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్



టీజీపీఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దిలీప్,పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రమేష్‌బాబుతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : టీజీ పీఈ సెట్ నిర్వహణతో పాలమూరు యూనివర్సిటీ ప్రతిష్ట మరింత పెరుగుతుందని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. యూనివర్సిటీ పరిపాలనా భవనంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పీఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దిలీప్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రమేష్‌బాబుతో కలిసి మాట్లాడారు. యూనివర్సిటీలో మొదటి సిర్వహిస్తున్న పీఈసెట్ వివరాలను వెల్లడించారు. ఈ నెల 11నుంచి 14 వరకు ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. పీఈసెట్ ఎంపికల కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 కేంద్రాల్లో బీపీఎడ్, డీపీఎడ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బాలురకు అథ్లెటిక్స్‌లో 100, 800 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్ 6 కిలోలు, లాంగ్ జంప్, హైజంప్‌లతో పాటు, బాల్ బాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, లాంగ్ టెన్నిస్ పోటీలను నిర్వహించనున్నట్లు వివరించారు. బాలికలకు అథ్లెటిక్స్‌లో 100, 400 మీటర్ల పరుగుపందెం, షాట్‌పుట్ 4 కిలోలు, లాంగ్‌జంప్, హైజంప్, బాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, లాంగ్ టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు వీటిలో ఏదో ఒక క్రీడను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం టీజీ పీఈసెట్ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు.

జూరాలకు పెరిగిన వరద

- రెండు యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి

ధరూరు/దోమలపెంట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం స్వల్పంగా పెరిగింది. ఎగువన ఆల్మట్టి జలాశయంలో 59.46 టీఎంసీలు, నారాయణపూర్ జలాశయంలో 29.63 టీఎంసీల నీరు నీల్వ ఉంది. ప్రస్తుతం జూరాల జలాశయంలో నీటి నిల్వ 318.040 మీటర్లకు చేరుకున్నది. మొత్తం 4.944 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సోమవారం ఐదు వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా, విద్యుత్ ఉత్పత్తి కోసం 7,666 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రెండు యూనిట్ల ద్వారా 120 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. నెట్టెంపాడు లిఫ్ట్ కెనాల్‌కు 750, కోయిల్‌సాగర్ లిఫ్ట్ కెనాల్‌కు 315, మొత్తం 8,808 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

'శ్రీశైలం'లో 835 అడుగుల నీటి మట్టం

జూరాల విద్యుత్ ఉత్పఇత్త కేంద్రం నుంచి 7,615, సుంకేసుల నుంచి 893 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతోంది. మొత్తం 8,508 క్యూసెక్కుల నీరు దిగువకు వస్తోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా, సోమవారం నాటికి 835.40 అడుగులకు చేరింది. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలకు గాను, 55.5655 టీఎంసీల నీటి నిల్వ నమోదు అవుతోందని డ్యాం గేజింగ్ అధికారులు తెలిపారు. గడిచిన 24 గంటల వ్యవధిలో కుడి గట్టు విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని నిలిపి వేశారు. ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో 1,308 క్యూసెక్కుల నీటిని ఉపయోగించి 0.613 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. ప్రాజెక్టు నుంచి 1,585 క్యూసెక్కుల నీరు సాగర్‌కు విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

ఇంకెన్నాళ్లీ ఎదురుచూపులు

- శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితుల ఆవేదన
- భవిష్యత్ కార్యాచరణపై సమావేశం


భవిష్యత్ కార్యచరణపై సమావేశమైన శ్రీశైలం నిర్వాసితులు

పెబ్బేరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోసం ఇంకెన్నాళ్లు ఎదురుచూడాలని శ్రీశైలం ప్రాజెక్టు ముంపు నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన నిర్వాసితులు సోమవారం వనపర్తి జిల్లా, పెబ్బేరు పీజేపీ క్యాంపు కార్యాలయ ఆవరణలో సమావేశమై, భవిష్యత్ కార్యాచరణపై చర్చించుకున్నారు. శ్రీశైలం జలాశయ నిర్మాణంలో భూములు, ఇళ్లు కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని వాపోయారు. 98 జీవో ప్రకారం ఉద్యోగాల కల్పనలో నిర్లక్ష్యం కొనసాగుతుందని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి మొర పెట్టుకున్నట్లు తెలిపారు. వారి విజ్ఞప్తిని పరిశీలించిన న్యాయస్థానం నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఇటీవల జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. కానీ న్యాయస్థానానికి అధికారులు తప్పుడు నివేదికలు ఇస్తున్నారని ఆరోపించారు. తమకు న్యాయస్థానంపై అపారనమ్మకం ఉందన్నారు. సమావేశంలో డాగోజీ, గోవిందు, మధు, కృష్ణయ్య పాల్గొన్నారు.

మహిళా క్రికెట్ టోర్నీలో రెడ్ జట్టు గెలుపు

- 45 పరుగులు చేసి రాణించిన అనిత
- నాలుగు వికెట్లు తీసిన మహేశ్వరి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎండీసీఏ చీఫ్ ప్యాట్రన్ మనోహర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా అండర్-25 మహిళా క్రికెట్ టోర్నీలో రెడ్ జట్టు బ్లూ జట్టుపై 53 పరుగుల తేడాతో విజయం సాధించింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం సమీపంలోని సమర్థ పాఠశాల మైదానంలో నిర్వహించిన లీగ్ మ్యాచ్ నిర్వహించారు. మొదట బ్యాటింగ్ చేసిన రెడ్ జట్టు 25 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసింది. ఎం.అనిత 45 బంతుల్లో 6 ఫోర్లతో 45 పరుగులు, అక్షర రాథోడ్ 72 బంతుల్లో ఒక ఫోర్‌తో 43 పరుగులు చేసింది. ప్రతీక 27, వైశాలి 11 పరుగులు చేశారు. బ్లూ జట్టు బౌలర్లలో దివ్యా రాథోడ్ 2, కరీనా ఒక వికెట్ తీశారు. లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన బ్లూ జట్టు 25 ఓవర్లలో 107 పరుగులు చేసి ఓటమి పాలయ్యింది.

జట్టులో సరస్వతి 21, ప్రవళిక 24, కరీనా 13 పరుగులు చేసింది. రెడ్ జట్టు బౌలర్లలో మహేశ్వరి 4, ఎం. అనిత, సింధూజ చెరో రెండు వికెట్లు తీసి జట్టు విజయానికి కృషి చేశారు.

రెండవ మ్యాచ్‌లో బ్లూ జట్టు గెలుపు

క్రికెట్ టోర్నీ రెండో మ్యాచ్‌లో బ్లూ జట్టు, పింక్ జట్టుపై 43 పరుగుల తేడాతో గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన బ్లూ జట్టు 25 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది. జట్టులో కరీనా 34, మంజుల 23, ఆర్. స్వాతి 28 పరుగులు చేసింది. పింక్ జట్టులో మేఘనగౌడ్ 2, త్రివేణి, కవిత, శైలు ఒక్కో వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పింక్ జట్టు 19.1 ఓవర్లలో 79 పరుగులకు కుప్పకూలింది. జట్టులో పవిత్ర 20, త్రివేణి 11 పరుగులు చేసింది. బ్లూ జట్టు బౌలర్లలో దివ్యా రాథోడ్ 5 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. ప్రవళిక 2, నిర్మల, ఆర్. స్వాతి, తేజశ్రీ ఒక్కో వికెట్ తీశారు.


45 పరుగులు చేసి రాణించిన అనిత


4 వికెట్లు తీసిన మహేశ్వరి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా మహిళ క్రికెట్ టోర్నీని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. మహిళా క్రికెటర్లు రంజీ, జాతీయ జట్టుకు ఎంపిక కావాలని ఆకాక్షించారు. తెలంగాణకు చెందిన గొంగడి త్రిష అంతర్జాతీయ టోర్నీలో ప్రతిభ చాటిందని గుర్తుచేశారు.

కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షులు సురేశ్‌కుమార్, వెంకటరామారావు, కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా, సీనియర్ క్రీడాకారుడు ఆబిద్, ఎన్‌ఆర్‌ఐ కె. శ్రీనివాసులు పాల్గొన్నారు.

గెలుపు కోసం శ్రమించాలి

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అల్జాపురి శ్రీనివాస్


సమావేశంలో నేతలను పరిచయం చేసుకుంటున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అల్జాపూరి శ్రీనివాస్

నారాయణపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతీ కార్యకర్త శ్రమించాలని బీజేపీ రాష్ట్ర అధికారి ప్రతినిధి అల్జాపురం శ్రీనివాస్ అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పదకొండేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. నారాయణపేట పట్టణంలోని లక్ష్మీగార్డన్స్‌లో జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన పార్టీ కార్యశాల సమావేశానికి సీనియర్ నాయకుడు నాగూరావు నామాజీతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయలేదని ఆరోపించారు. ప్రజలను దోచుకోవడంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒక్కటేనన్నారు. ప్రజాస్వామ్యానికి పాతర వేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. సబ్‌కా వికాస్ సబ్‌కా విశ్వాస్ నినాదంతో కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. వక్ఫ్ బోర్డు చట్ట సవరణతో నష్టం లేదన్న విషయాన్ని ముస్లింలకు వివరించాలని సూచించారు. ఆపరేషన్ సిందూర్‌తో ప్రధాని మోదీ పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పారన్నారు. కార్యక్రమంలో నాయకులు రతంగ్ పాండురెడ్డి, అమర్ దీక్షిత్, గోవర్ధన్‌గౌడ్, శ్రీనివాస్, పోషల్ వినోద్, పదాధికారులు పాల్గొన్నారు.

డిసెంబర్ నాటికి పూర్తయ్యేనా?

(5వ పేజీ తరువాయి)

వినియోగించుకోవచ్చని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అప్పుడు ప్రాజెక్టు ఫలాలు క్రమంగా అందడం ప్రారంభమైతే వ్యతిరేకత కూడా తగ్గుతుందని డిసెంబర్‌ను డెడ్‌లైన్ పెట్టుకొని పనిచేస్తున్నారు. అయితే ఆలోపు పూర్తవుతుందా? అనే సందేహాలు మాత్రం వ్యక్తమవుతున్నాయి.

పెండింగ్ పనులు ఎక్కడివక్కడే...

ప్రాజెక్టుల సమీక్ష సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మొదటి దశలో తక్కువ ఖర్చు చేస్తే ఎక్కువ ప్రయోజనం ఉన్న ప్రాజెక్టులను 2025 డిసెంబర్‌లోపు పూర్తిచేయాలని ఆదేశించారు. మహబూబ్‌నగర్ జిల్లా సమీక్ష సందర్భంగా కూడా అదే విషయాన్ని ప్రకటించారు. ఈ రెండు బడ్జెట్‌లలో కావాల్సిన నిధులపై అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. బడ్జెట్‌లో కేటాయింపులు కూడా దక్కాయి. కానీ ఇప్పటివరకు పెండింగ్ ప్రాజెక్టుల పనులను పట్టించుకోవడం లేదు. ఏదో చేస్తున్నామని చెప్పుకోవడం తప్పా ఇరిగేషన్ శాఖ నిర్దిష్టంగా ఏ పెండింగ్ పనీ పూర్తిచేయలేదు. భీమా ఫేజ్-1లో సంగంబండ కింద ఇంకా పిల్ల కాలువల పనులు పూర్తికాలేదు. దీంతో పూర్తి ఆయకట్టుకు నీరివ్వలేని పరిస్తితి. భీమా ఫేజ్-2లో శంకరసముద్రం ముంపు గ్రామం కానాయపల్లిని ఖాళీచేసి పునరావాస కాలనీకి తరలించాల్సి ఉండగా ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. దీంతో ఎడమ కాలువ 22 వేల ఎకరాలకు నీరివ్వలేని దుస్థితి ఉన్నది. నెట్టెంపాడు లీకేజీలను అరికట్టడం కోసం నిధులు మంజూరు కాలేదు. సాంకేతిక నిపుణుల కమిటీ పలుమార్లు వచ్చి నివేదికలు ఇచ్చినా చర్యలు లేవు. దీంతో సగం నీటిని మాత్రమే నిల్వ చేసుకోవాల్సిన పరిస్థితి ఉన్నది. అలాగే 99, 100 ప్యాకేజీల్లో ఇంకా పనులు పూర్తికాలేదు. కేఎల్ఐ కింద 4.20 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా ఇప్పటివరకు 2 లక్షల పైచిలుకు ఎకరాలకు మాత్రమే నీరందిస్తున్నారు. సరైన నీటినిల్వ సామర్థ్యం లేకపోవడంతో సమృద్ధిగా వరద వస్తున్నా వినియోగించుకోలేని పరిస్థితులు ఉన్నాయి. అలాగే డిస్ట్రిబ్యూటరీలకు లైనింగ్‌లు, ఫీడర్ చానల్స్ లేకపోవడం, చెరువుల ఆయకట్టుపైనే ఆధారపడటం వల్ల ఆయకట్టు స్థిరీకరణ జరగడం లేదు. మరో ఆరు నెలల సమయం మాత్రమే డెడ్‌లైన్‌కు మిగిలి ఉన్నది. అయినప్పటికీ ఇంకా పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నచందంగా ఉన్నాయి.

వేర్వేరు ప్రాంతాల్లో నలుగురి అదృశ్యం

- జడ్చర్ల మండలంలో తల్లీ కొడుకులు


జడ్చర్ల/ తెలకపల్లి/ తిమ్మాజీపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో నలుగురు అదృశ్యం అయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలం, కోడ్గల్ గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మణ్‌నాయక్ తండాలో కుమారుడు సహా తల్లి అదృశ్యమైంది. జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాల మేరకు.. కేశంపేట మండలం, తొమ్మిదిరేకుల గ్రామ పరిధిలోని నాను తండాకు చెందిన కల్యాణికి రెండు సంవత్సరాల క్రితం జడ్చర్ల మండలం లక్ష్మణ్ నాయక్ తండాకు చెందిన ముడావత్‌కిషన్‌తో వివాహం అయ్యింది. వారికి ఒక సంవత్సరం వయసున్న కుమారుడు ఉన్నాడు. ఈ నెల 8న మధ్యాహ్నం 12 గంటల సమయంలో కల్యాణి భర్త పెద్దషాపూరుకు వెళ్లాడు. సాయంత్రం 6 గంటలకు తిరిగి వచ్చే సరికి భార్య కల్యాణితో పాటు కుమారుడు కనిపించలేదు. వెంటనే కల్యాణి తల్లిదండ్రులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. దీంతో వారు తండాకు చేరుకున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా కన్పించలేదు. దీంతో కల్యాణి తల్లి మేఘావత్ ముత్యాలు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ తెలిపారు.

ఈర్లపల్లి గ్రామానికి చెందిన వృద్ధుడు


రాచమల్ల ఆశయ్య (ఫైల్)

మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలం ఈర్లపల్లి గ్రామానికి చెందిన రాచమల్ల ఆశయ్య (80) అదృశ్యం అయ్యాడు. సీఐ కమలాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మతిస్థిమితం సరిగా లేని ఆశయ్య 20 సంవత్సరాల క్రితం ఇంటి నుంచి వెళ్లి తిరిగి ఇప్పటి వరకు రాలేదు. ఈ విషయంపై ఆయన కుమారుడు రాచమల్ల లక్ష్మయ్య సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

జమిస్తాపూర్‌లో మరో వృద్ధుడు..


బోయ వెంకటయ్య (ఫైల్)

నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల పరిధిలోని జమిస్తాపూర్‌కు చెందిన బోయ వెంకటయ్య (60) ఈ నెల 4న అదృశ్యం అయ్యాడు. తెలకపల్లి ఎస్ఐ న రేశ్ సురేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆయన భార్య అలివేల ఏప్రిల్ 24న అనారోగ్యంతో బాధ పడుతున్న తన తండ్రికి సేవ చేసేందుకు లింగాల మం డలం జీనుగపల్లికి వెళ్లింది. వెంకటయ్య ఈనెల 4న భార్య దగ్గరికి వెళ్తున్నానని స్థానికులకు చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. 6వ తేదీన భార్య అలివేల జమిస్తాపూర్ గ్రామానికి వచ్చింది. భర్త వెంకటయ్య కనిపించకపోవడంతో చు ట్టుపక్కల గ్రామాల్లో బంధువుల ఇళ్లలో వెతికింది. ఆచూకీ దొరకక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తిమ్మాజీపేటలో యువకుడు


మేకల యశ్వంత్ (ఫైల్)

తిమ్మాజీపేట మండల కేంద్రానికి చెందిన మేకల యశ్వంత్ (19) ఈనెల 4న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అతడి తండ్రి మేకల మల్లేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యశ్వంత్ ఈ నెల 4న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో 6వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రస్తుతం బీఫార్మసీ చదువుతున్న యశ్వంత్ ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని మల్లేశ్ కోరారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రంగంలోకి విజిలెన్స్

- అయిజలో మకాం వేసిన అధికారులు
- ఇసుక టిప్పర్లపై కేసు నమోదు చేసిన పోలీసులు
- భయంతో ఇసుక వాహనాలు నిలిపివేత
- ఆంధ్రజ్యోతి కథనంతో సీసీ కెమెరాలు ఏర్పాటు



ఆదివారం రాత్రి గద్వాల పోలీసులు పట్టుకున్న టిప్పర్లు


సీసీ కెమెరాల ఏర్పాటు

గద్వాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో ఓవర్‌లోడ్‌తో ఇసుక రవాణాకు అడ్డుకట్ట వే సేందుకు విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. 'ఇ సుక తరలింపులో ఓవర్ యాక్షన్' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' లో కథనం ప్రచురితమైంది. స్పందించిన విజిలెన్స్ అ. దికారులు, గద్వాల పోలీసులు సీరియస్‌గా తీసుకున్నా రు. ఆదివారం సాయంత్రం ఓవర్‌లోడ్‌తో గద్వాలకు వస్తున్న టిప్పర్లను పోలీసులు పట్టుకున్నారు. గద్వాల పట్టణంలో ఐదు, రూరల్‌లో రెండు టిప్పర్లతో పాటు మల్దకల్ పోలీసులు కూడా మరికొన్ని పట్టుకున్నారు. ఇందులో పాసింగ్ లోడ్‌తో వచ్చిన టిప్పర్లను వదిలేశారు.

ఓవర్‌లోడ్‌తో వచ్చిన టిప్పర్లను ఆర్టీవో, మైనింగ్ అధికారులకు అప్పగించారు. ఓవర్‌లోడ్‌తో వచ్చే ఇసుక టిప్పర్లను పట్టుకునే హైదరాబాద్ నుంచి వచ్చిన విజిలెన్స్ అధికారులు అయిజలో మకాం వేశారు.

ముందే పసిగట్టిన టిప్పర్ల యజమానులు..

మూడు రోజులుగా ఓవర్‌లోడ్‌తో గద్వాల పట్టణానికి ఇసుక రవాణ చేస్తుండటంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురించింది. విజిలెన్స్ అధికారులు వస్తారనే సమాచారాన్ని ముందే పసిగట్టిన టిప్పర్ యజమానులు టిప్పర్లను నిలిపివేశారు. గద్వాలకు వస్తే పాసింగ్ లోడ్‌తోనే(19.5టన్నులు) రావాలని నిర్ణయించుకున్నట్లు సమచారం. అందుకే మధ్యాహ్నం మూడు గంటల వరకు మూడు టిప్పర్లు మాత్రమే టీజీఎండీసీ ఇసుక కేంద్రం నుంచి ఇసుకతో బయటకు వచ్చాయి. ప్రతీ రోజు 30నుంచి 40 టిప్పర్ల వరకు వచ్చే టిప్పర్లు సోమవారం ఇసుక రీచ్ వద్ద కనిపించలేదు.

ఇసుక రీచ్ వద్ద నిఘా..

తుమ్మిళ్ల ఇసుక కేంద్రం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. ప్రారంభం రోజే విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేసి పలు అంశాలను వారు సూచించారు. సోమవారం సీసీ కెమెరాలను బిగించాం. వేయింగ్ మిషన్ కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదించాం. రెండు మూడు రోజులలో ఏర్పాటు చేస్తాం. అప్పటి వరకు పాసింగ్ లోడ్‌తో ఇసుక రవాణ జరుగుతుంది. అధికలోడ్ పేరుతో ఇసుక కేంద్రం వద్ద ఎవరైన డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయవచ్చు.

- శ్రీకాంత్, ప్రాజెక్టు మేనేజర్

క్రైం కార్నర్

తెలంగాణ ఉద్యమకారుడి మృతి


వినోద్‌కుమార్ (ఫైల్)

మహబూబ్‌నగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి నాయకుడిగా చురుకైన పాత్ర పోషించిన వినోద్‌కుమార్ (50) సోమవారం ఉదయం మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని హనుమాన్‌పురలో నివాసం ఉంటున్న వినోద్‌కుమార్ పాలమూరు యూనివర్సిటీలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం బీఆర్ఎస్ నగర ప్రధానకార్యదర్శిగా ఉన్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఓ కూతురు ఉండగా ఏడాది క్రితం కూతురు మృతి చెందింది.

నీటి గుంతలో పడి ఇద్దరు చిన్నారుల దుర్మరణం

» బొమ్మన్‌పల్లి గ్రామంలో ఘటన

అచ్చంపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ పొలంలో నీటిని పొదుపు చేసేందుకు ఏర్పాటు చేసిన గుంతలో పడి ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారులు మృతి చెందిన సంఘటన సోమవారం నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని బొమ్మన్‌పల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బొమ్మన్‌పల్లి గ్రామానికి చెందిన ధరణి, సుధాకర్ దంపతులకు ఇద్దరు కుమారులు అశ్విత్ కుమార్(7), చేతన్(6) ఉన్నారు. ఆదివారం కురిసిన వర్షానికి సోమవారం ఉదయం తమ వ్యవసాయ పొలంలో విత్తనాలు విత్తేందుకు తల్లిదండ్రులు వెళ్లారు. వారివెంట వారి కుమారులు కూడా వెళ్లారు. వారి పక్క పొలంలో నీటినిల్వ కోసం ఏర్పాటు చేసిన గుంత పక్కనే అందరూ కలిసి భోజనం చేశారు. ఆ తర్వాత తల్లిదండ్రులు విత్తనాలు విత్తే పనిలో ఉండగా ఆ చిన్నారులు ఇద్దరూ ఆడుకుంటూ ప్రమాదవశాత్తు గుంతలో పడ్డారు. చిన్నారులు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు చుట్టు పక్కల వెతికి నీటి గుంత దగ్గరకు వెళ్లిచూడగా అప్పటికే చిన్నారులు మృతి చెంది ఉన్నారు. దీంతో తల్లి రోదనలకు అవధులు లేకుండాపోయాయి. చిన్నారుల మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

టిప్పర్ ఢీకొని రైతు మృతి


రైతు మద్ది మైసయ్య (ఫైల్)

మిడ్జిల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మట్టిని తరలిస్తున్న టిప్పర్ ఢీకొని ఓ రైతు మృతి చెందిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకున్నది. ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం తెల్లవారుజామున కేఎల్ఐ కాల్వకు చెందిన మట్టిని మిడ్జిల్ నుంచి కొత్తూరు వరకు చేపట్టిన రోడ్డు పనులకు తరలిస్తున్న టిప్పర్ మిడ్జిల్‌కు చెందిన రైతు మద్ది మైసయ్య(63)ను వెనుక నుంచి ఢీకొన్నది. దీంతో తీవ్రగాయాలైన అతన్ని స్థానికులు వెంటనే చికిత్స కోసం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మైసయ్య మృతి చెందాడు. టిప్పర్ డ్రైవర్ అజాగ్రత్త వల్లే తన తమ్ముడి ప్రాణాలు పోయాయని మృతుడి అన్న రాంచంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పూర్తి స్థాయిలో విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

కుంటలో పడి వ్యక్తి...

పెద్దకొత్తపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని పెద్దకార్పాముల గ్రామంలో సోమవారం ఈ సంఘటన జరిగింది. పెద్దకొత్తపల్లి ఎస్ఐ వి.సతీశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తెలుగుకాళ్ల లింగస్వామి (37) వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం మరో వ్యక్తితో కలిసి గ్రామ సమీపంలోని ఈదోనుకుంట వద్దకు వెళ్లారు. ఆ సమయంలో కుంటలో దిగిన లింగస్వామి ప్రమాదవశాత్తు నీటిలో పడి మునిగిపోయాడు. అతడి వెంట ఉన్న వ్యక్తి గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో స్థానికులతో కలిసి అక్కడికి చేరుకున్న వారు కుంటలో గాలించగా అతడి మృతదేహం లభించింది. సంఘటనపై మృతుడి భార్య నిర్మల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దకొత్తపల్లి ఎస్ఐ తెలిపారు. లింగస్వామికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పాతకక్షలతో వృద్ధుడిపై దాడి

» తీవ్రంగా గాయపడి మృతి


మృతి చెందిన కమ్మరి రేణయ్య (ఫైల్)

బల్మూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : పాత కక్షలతో జరిగిన దాడిలో ఓ వృద్ధుడు తీవ్రంగాగా యపడి మృతి చెందాడు. బల్మూరు ఎస్ఐ ఎ. రాజేందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, బల్మూరు మండల కేంద్రానికి చెందిన రేణయ్య (72)కు, అదే గ్రామానికి చెందిన బోయ మీనుగు ఎర్రయ్యల మధ్య 15 ఏళ్ల గా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం రేణయ్యపై ఎర్రయ్య, అతడి కుమారుడు శివ కర్రలతో దాడి చేశారు. ఈ సంఘటనపై రేణయ్య చిన్నాన్న కుమారుడు వెంకటయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎర్రయ్య, శివలను పోలీసులు అదుపులోకి తీసుకొని, విచారించి వదిలి పెట్టారు. వారి దాడిలో తీవ్రంగా గాయపడిన రేణయ్య సోమవారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ రాజేందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

జడ్చర్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో సీలింగ్‌ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జడ్చర్ల పట్టణంలోని శ్రీనివాసకాలనీలో చోటుచేసుకుంది. జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాల మేరకు... నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన మంద మహేశ్ కన్నారెడ్డి (30), భార్య వైష్ణవి దంపతులు జడ్చర్లలో నివాసం ఉంటున్నారు. అతడు పట్టణంలోని కల్వకుర్తి రోడ్డులో జిమ్ నిర్వహిస్తున్నాడు. జిమ్ ఖర్చుల విషయంలో ఈ నెల 8న భార్యతో స్వల్ప తగాదా జరిగింది. ఆ తర్వాత మహేశ్ భోజనం చేసి బెడ్‌రూంలోకి వెళ్లి సీలింగ్‌ఫ్యాన్‌కు టవల్‌తో ఉరి వేసుకున్నాడు. గమనించిన భార్య వెంటనే లైటర్ సహాయంతో టవల్‌ను కాల్చి అతడిని కిందకు దించింది. చికిత్స కోసం జడ్చర్లలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసు కెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తన కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ తండ్రి మంద శేఖర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యువతిపై యువకుడి అత్యాచారం

» కేసు నమోదు చేసిన పోలీసులు

నవాబ్‌పేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఒకే తండాలో ఉంటూ చాలా కాలంగా కన్నేసిన కామంధుడు ఇంట్లో ఎవరు లేని సమయంలో యువతిపై అత్యాచారం చేశాడు. అంతటితో ఆగకుండా మరోసారి తనకు సహకరించాలని, లేదంటే మీ అమ్మానాన్నలను చంపేస్తానని బెదిరించాడు. దీంతో ఆందోళన చెందిన ఆమె పోలీసులను ఆశ్రయించింది. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలంలోని ఓ తండాలో జరిగింది. ఎస్ఐ విక్రం కథనం ప్రకారం.. మండలంలోని ఓ తండాలో ఓ ప్రధాన పార్టీకి చెందిన ప్రేమ్‌కుమార్ అనే యువకుడు అదే తండాకు చెందిన యువతిపై 15 రోజుల క్రితం ఇంట్లో ఎవరులేని సమయంలో అత్యాచారం చేశాడు. మరోసారి తనకు సహకరించాలని వేధించడంతో ఆమె ఆందోళనకు గురై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

వచ్చే నెలలో.. వన మహోత్సవం

» జోగుళాంబ గద్వాల జిల్లాలో ఏర్పాట్లు
» 15,30,000 మొక్కలు నాటడమే లక్ష్యం
» నర్సరీలలో సిద్ధంగా ఉన్న మొక్కలు

అయిజ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలో వన మహోత్సవానికి రంగం సిద్ధం అయ్యింది. అందుకు అవసరమైన కసరత్తును అధికారులు ప్రారంభించారు. ప్రణాళిక ప్రకారం సిద్ధం అవుతున్నారు. వర్షాలు జోరందుకోగానే మొక్కలు నాటేందుకు అసరమైన ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఈ సంవత్సరం వర్షాలు ముందుగానే వచ్చి మురిపించడంతో పనులను వేగవంతం చేశారు. నర్సరీలను పర్యవేక్షిస్తున్నారు. ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు.


సింధనూర్ నర్సరీలో వనమహోత్సవానికి సిద్ధంగా ఉన్న మొక్కలు

గ్రామ పంచాయతీల్లో నర్సరీలు

జోగుళాంబ గద్వాల జిల్లాలోని 255 గ్రామ పంచాయతీలలో ప్రభుత్వం నర్సరీలను ఏర్పాటు చేసింది. వన మహోత్సవానికి అవసరమైన మొక్కలను వాటిల్లో పెంచుతున్నారు. ప్రతీ గ్రామ పంచాయతీకి 6 వేల మొక్కలను లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 15,30,000 మొక్కలు నాటడమే లక్ష్యంగా అధికారులు ముందడుగు వేస్తున్నారు. అయిజ మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో 1,68,000 మొక్కలు నాటాలని నిర్ణయించుకున్నారు. అందుకోసం అవసరమైన స్థలాలను ఎంపిక చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాల ప్రాంగణాలు, రహదారులకు ఇరువైపుల, బీడు భూములను గుర్తిస్తున్నారు. మొక్కల నాటిన తర్వాత వాటికి రక్షణ ఏర్పాట్లు, నీటి వసతిపై దృష్టి సారిస్తున్నారు.

వన మహోత్సవంలో నాటేందుకు నర్సరీల్లో రెయిన్‌ట్రీ, గుల్మొహర్, కానుగ, దానిమ్మ, నిమ్మ, దానిమ్మ, ఖర్జూర, చింత, వేపతో పాటు పూలు, పండ్ల మొక్కలతో పాటు వివిధ రకాల మొక్కలను నర్సరీల్లో సిద్ధం చేస్తున్నారు.

వన మహోత్సవానికి సిద్ధంగా ఉన్నాం



మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాం. నిర్ణయించిన లక్ష్యం మేరకు మొక్కలను నాటేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశాం. వర్షాలు జోరందుకోవడమే ఆలస్యం, మొక్కలు నాటే కార్యక్రమం మొదలు పెడతాం. అందుకోసం జిల్లాలోని అన్ని నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి.

- నర్సింగరావు, అదనపు కలెక్టర్

చురుగ్గా సాగుతున్న ఏర్పాట్లు

వర్షాకాలం వచ్చేనెల రెండవ వారం నుంచి ప్రారంభం కానున్నది. వర్షాలు కురుస్తున్న సమయంలో మొక్కలు నాటితే చక్కగా ఏపుకొని ఎదుగుతాయని అధికారులు భావిస్తున్నారు. అందుకు అనుగుణంగా నిర్వహించనున్న వనమహోత్సవంలో లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కల స్థితిగతులను పరిశీలిస్తున్నారు. నాటే సమయానికి అన్ని మొక్కలను సిద్ధం చేయాలని నిర్వాహకులను ఆదేశిస్తున్నారు.

భారత్‌పై అమెరికా పెత్తనం ఏమిటి?

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ


పార్టీ జెండాను ఎగురవేస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

గద్వాల టౌన్/ గద్వాల క్రైం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : అగ్రరాజ్యం అమెరికా మన దేశంపై పెత్తనం చెలాయించడం ఏమిటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రశ్నించారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భవిష్యత్ కార్యాచరణపై జిల్లా శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో నాలుగవ ఆర్థికశక్తిగా ఎదిగామని గొప్పలు చెబుతున్న కేంద్ర పాలకులు దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న నిరుద్యోగం, ఆర్థిక, సామాజిక అంతరాల గురించి ఎందుకు మాట్లాడటం లేదన్నారు. గద్వాల జిల్లాలో సాగుతున్న ఆధిపత్య రాజకీయాలను ప్రజలకు వివరించి, ప్రత్యామ్నాయ నాయకత్వం కోసం సిద్ధమయ్యేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. అంతకు ముందు రాష్ట్ర కార్యదర్శి హోదాలో తొలిసారి జిల్లా పర్యటనకు వచ్చిన జాన్‌వెస్లీకి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలోని అంబేద్కర్, జ్యోతిబా పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సమావేశానికి ముందు పార్టీ జెండాను ఎగురవేసి శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీరామ్‌నాయక్, జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, జిల్లా కమిటీ సభ్యులు జి.రాజు, రేపల్లే దేవదాస్, పరంజ్యోతి, వీవీ నరసింహ, మద్దిలేటి, ఉప్పేరు నరసింహ, ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద, నాయకులు ఈదన్న, రమేష్ పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయానికి తాళం

» 36 నెలలుగా భవనం అద్దె బకాయి
» అధికారులతో యజమాని వాగ్వాదం
» మూడు గంటల పాటు ఆరుబయటే ఎంపీడీవో, ఉద్యోగులు


కార్యాలయానికి తాళం వేయడంతో ఆరు బయట నిలిచి ఉన్న ఎంపీడీవో చెన్నమ్మ, ఉద్యోగులు

అమరచింత, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : అద్దె డబ్బులు ఇవ్వడం లేదని ఎంపీడీవో కార్యాలయానికి భవనం యజమాని దంపతులు తాళం వేశారు. దీంతో మూడు గంటల పాటు అధికారులు, ఉద్యోగులు ఆరుబయటే ఉండాల్సి వచ్చింది. వనపర్తి జిల్లా, అమరచింతలో ఈ సంఘటన జరిగింది. అమరచింత మండలంగా ఏర్పడినప్పటి నుంచి ఎంపీడీవో కార్యాలయం అద్దె భవనంలోనే కొనసాగుతోంది. అద్దె బకాయిల కోసం కార్యాలయానికి తాళం వేయడం ఇది నాలుగవ సారి. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండుసార్లు, తాజాగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గత డిసెంబర్‌లో కూడా కార్యాలయానికి తాళం వేశారు. దీంతో అప్పటి ఎంపీడీవో 31 నెలల అద్దె బకాయికి సంబంధించి రూ. 3.10 లక్షల చెక్కును సిద్ధం చేసి ఎస్‌టీవోకు పంపించారు. కానీ ఇప్పటికీ ఆ డబ్బు యజమానికి అందలేదు. దీంతో మొత్తం 36 నెలల అద్దె బకాయిలు రాకపోవడంతో యజమాని సురేందర్ దంపతులు సోమవారం ఉదయం 9 గంటలకు కార్యాలయానికి తాళం వేశారు. 10 గంటల సమయంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కార్యాలయానికి చేరుకున్నారు. తాళం వేసి ఉండటంతో మూడు గంటల పాటు అరుబయటే వేచి ఉన్నారు. ఎంపీడీవో చెన్నమ్మ, ఎంపీవో నరసింహయ్య, పోలీసులు కలిసి ఇంటి యజమాని సురేందర్ దంపతులతో చర్చలు జరిపినా ఫలితం లేకపోయింది. చివరకు కలెక్టర్, అదనపు కలెక్టర్లతో ఎంపీడీవో ఫోన్‌లో మాట్లాడారు. వారి ఆదేశం మేరకు మిగిలిన ఐదు నెలల చెక్కును వెంటనే సిద్ధం చేసి, మొత్తం 36 నెలల అద్దె డబ్బులు త్వరలో వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో యజమాని కార్యాలయం తాళం తీయడంతో వివాదం సద్దు మణిగింది.

గురుకుల కార్యదర్శిని సస్పెండ్ చేయాలి

» కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు



కేవీపీఎస్ జిల్లా స్థాయి శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు

కొల్లాపూర్, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : దళిత విద్యార్థులను చదువుకు దూరం చేసేందుకు యత్నిస్తున్న గురుకుల కార్యదర్శి అలుగు వర్షిణిని సస్పెండ్ చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్‌లోని సత్యసాయి విద్యాలయంలో సోమవారం ప్రారంభమైన జిల్లా స్థాయి సామాజిక శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ గురుకులాలను రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. గురుకుల కార్యదర్శి వైఖరి యావత్ దళిత సమాజాన్ని అవమానపరిచే విధంగా ఉందన్నారు. ఇప్పటికైనా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్, ఆరోగ్య శాఖ మంత్రి దామోదరం రాజనర్సింహ, మంత్రి వివేక్ వెంకటస్వామి లాంటి వారు చొరవ తీసుకొని ఆమెను సస్పెండ్ చేయాలని కోరారు.

లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అంతటి కాశన్న, పులిజాల పరశురాములు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివ వర్మ, జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంత్, రాజు, అశోక్, మహిళా కన్వీనర్ స్వాతి, సంజు, సంజీవ్, సాయి, శివ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ

» స్థల ధ్రువీకరణ పత్రాల సృష్టి
» ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో వెలుగులోకి వ్యవహారం

రాజాపూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి ఇంటి స్థలానికి ధ్రువీకరణ పత్రాలను సృష్టించారు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా, రాజాపూర్ మండలంలోని చొక్కంపేట గ్రామంలో జరిగింది. ఎస్ఐ శివనాందం తెలిపిన వివరాల ప్రకారం.. చొక్కంపేట మాజీ సర్పంచ్ కృష్ణయ్య 2023, ఆగస్టు 11వ తేదీతో అప్పటి పంచాయతీ కార్యదర్శి నరేందర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి గ్రామ పంచాయతీకి సంబంధం లేని స్థలానికి అదే గ్రామానికి చెందిన మంచాల రమేశ్, మంచాల చెన్నయ్య, మంచాల యాదమ్మల పేర్లతో ధ్రువీకరణ పత్రాలను తయారు చేసి వారికి ఇచ్చాడు. ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న పంచాయతీ కార్యదర్శి జైపాల్ ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహిస్తుండగా ఆ విషయం బయటపడింది.

దీంతో ఈనెల ఐదవ తేదీన మండల పరిషత్ అధికారులు అప్పటి పంచాయతీ కార్యదర్శి నరేందర్‌ను వివరణ కోరారు. అది తన సంతకం కాదని, తాను ఎవరికీ పత్రాలు ఇవ్వలేదని అతడు స్పష్టం చేశారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చసినట్లు ఎస్ఐ తెలిపారు.

కోయిల్‌సాగర్‌కు చేరుతున్న జూరాల నీరు

దేవరకద్ర, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలోని కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు జూరాల నుంచి నీరు వచ్చి చేరుతోంది. దీంతో నీటి మట్టం క్రమంగా పెరుగుతోందని ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు. నాలుగు రోజులుగా జూరాల ప్రాజెక్టు, తీలేర్ పంప్ హౌజ్ నుంచి ఒక మోటార్ ద్వారా కృష్ణా జలాలను కోయిల్‌సాగర్‌కు విడుద ల చేస్తున్నారు. ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్టులో 11 అ డుగుల నీరు ఉండగా, సోమవారం సాయంత్రం వరకు 12.5 అడుగులకు చే రింది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 32.5 అడుగులు కాగా, ఇంకా 19.5 అడుగుల నీరు వచ్చి చేరితే పూర్తిస్థాయిలో నిండే అవకాశం ఉంది.

గవర్నర్‌ను కలిసిన శివకుమార్


శివకుమార్‌ను అభినందిస్తున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

కల్వకుర్తి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తికి చెందిన జాతీయ యువజన పురస్కార గ్రహీత శివకుమార్ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కలిశారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ నుంచి ఆహ్వానం అందడంతో సోమవారం ఆయన గవర్నర్‌ను కలిసి శాలువా కప్పి సన్మానించారు. పూలమొక్క అందించి కృతజ్ఞతలు తెలిపారు. దాదాపు 20 నిమిషాల పాటు గవర్నర్ ఆయనతో మాట్లాడారు. శివకుమార్ చేస్తున్న సేవా కార్యక్రమాలను గవర్నర్ తెలుసుకుని అభినందించారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దురాప్రసాద్, స్వామి వివేకానంద సేవా బృందం సభ్యుడు లక్ష్మీనరసింహ ఉన్నారు.

క్రికెట్ ఉమ్మడి జిల్లా జట్టుకు క్రీడాకారుల ఎంపిక


జడ్చర్ల మినీస్టేడియంలో ప్రాబబుల్స్ మ్యాచ్ ఆడుతున్న క్రీడాకారులు

జడ్చర్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లా క్రికెట్ అండర్-23 జట్టు ఎంపిక ప్రక్రియలో భాగంగా సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పట్టణంలోని మినీ స్టేడియంలో ప్రాబబుల్స్ మ్యాచ్‌ను నిర్వహించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి 27 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. వీరిని రెండు జట్లుగా విభజించి ఎండీసీఏ రెడ్, ఎండీసీఏ బ్లూ జట్లుగా విభజించారు. వారితో రెండు రోజుల పాటు 50 ఓవర్ల మ్యాచ్‌లు నిర్వహించి, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో ఉమ్మడి పాలమూరు జిల్లా జట్టును ఎంపిక చేయనున్నారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజశేఖర్, కోచ్‌లు అబ్దుల్లా, మహేశ్, ముజీబ్, పరిశీలకుడు ముక్తార్ పాల్గొన్నారు.

హార్డ్‌వేర్ దుకాణంలో చోరీ

వనపర్తి రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : హర్డ్‌వేర్ దుకాణంలో చోరీ జరిగింది. వనపర్తి జిల్లా కేంద్రంలోని రామ్‌నగర్‌లో ఈ సంఘటన జరిగింది. వనపర్తి పట్టణ కేంద్రానికి చెందిన గజ్జ రాజేందర్ గౌడ్ పట్టణంలో బాలాజీ హార్డ్‌వేర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. సోమవారం అతడు దుకాణంలో కూర్చొని ఉండగా ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చాడు. కొన్ని వస్తువుల ధరలు అడిగి వెళ్లిపోయాడు. సాయంత్రం దుకాణం మూసేటప్పుడు కౌంటర్‌లో ఉన్న డబ్బు లెక్కించగా రూ. 5 వేలు తక్కువగా ఉన్నట్లు గుర్తించాడు. సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేసినట్లు తేలడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

ఆత్మకూరు/ శ్రీరంగాపూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు. ఆత్మకూరు ఎస్ఐ నరేందర్, శ్రీరంగాపూర్ ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆత్మకూరు పట్టణంలోని గాంధీ చౌరస్తాలో ఏప్రిల్ 17న డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మూలమల్ల గ్రామానికి చెందిన ముద్దుట్ల శివరాజ్ అనే వ్యక్తి పట్టుబడ్డాడు. అతడిని సోమవారం వనపర్తి జూనియర్ సివిల్‌కోర్టులో హాజరు పరచగా రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.శ్రీలత తీర్పు వెలడించారు. అలాగే శ్రీరంగాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 5 రోజుల క్రితం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో జి.సురేశ్ అనే వ్యక్తి పట్టుబడ్డాడు. అతడిని వనపర్తి కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయాధికారి బి.శ్రీలత 7 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

న్యూస్ బాక్స్

రేపు ప్రత్యేక ప్రజావాణి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు, వయోవృద్ధులకు బుధవారం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి ఒక ప్రకటనలో తెలిపారు.

ఇరిగేషన్ ఏఈకి వినతి

హన్వాడ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇబ్రహీంబాద్ సమీపంలోని వెంకటరమణకుంటకు నీళ్లు వెళ్లే కాల్వకు అడ్డంగా ఉన్న వాటిని తొలగించాలని సోమవారం వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర నాయకుడు నాగన్న, రైతులు అనంతయ్య, కేశవులు, కృష్ణయ్య, వెంకటయ్య ఇరిగేషన్ ఏఈ తఫీక్‌కు వినతిపత్రం ఇచ్చారు.

చెరువులను రక్షించాలి

పాలమూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని చెరువులు, కుంటలు, నీటి ట్యాంకులు, కుంటలను భూ కబ్జాదారుల నుంచి రక్షించాలని తెలంగాణ ముదిరాజు మహాసభ అధ్యక్షుడు మెట్టుకాడి ప్రభాకర్ కలెక్టర్‌ను కోరారు. సోమవారం కలెక్టర్ విజయేందిర బోయిని కలిసి ఫిర్యాదు చేశారు.

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

రాజాపూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తిరుపతి, మండల అధ్యక్షుడు ఆనంద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు.

పీయూ అధ్యాపకుడికి నివాళి

పాలమూరు యూనివర్సిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీలో ఎంఈడీ విభాగంలో కాంట్రాక్ట్ పద్ధతిన అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసిన డాక్టర్ వినోద్‌కుమార్ సోమవారం తెల్లవారుజామున క్యాన్సర్‌తో పోరాడి మృతి చెందారు. విషయం తెలుసుకున్న పీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రమేష్‌బాబు, పీయూ అధికారులు వినోద్‌కుమార్ నివాళి అర్పించారు.

15 నుంచి 30 వరకు ఆబా అభియాన్ క్యాంపులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : గిరిజన మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం ప్రకటించబడిన ప్రధాన మంత్రి జాతీయ ఆదివాసి న్యాయ అభియాన్ మరియు ధరతి ఆబా జనజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకాలపై ఈనెల 15 నుంచి 30 వరకు అవగాహన, మరియు లబ్ధిదారులకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని కలెక్టర్ విజయేందిర బోయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డు, ఆహార భద్రత కార్డు, ఆయుష్మాన్ భారత్ కార్డు, కులం సర్టిఫికెట్, కిసాన్ క్రెడిట్ కార్డు, జన్‌ధన్ బ్యాంక్ అకౌంట్ మొదలగునవి ఎంపిక చేయబడిన గిరిజన గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించాలని కోరారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గిరిజన విద్యార్థులు బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి జనార్దన్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. 3, 5, 8వ తరగతిలో 2025-26 సంవత్సరానికి గాను (20) సీట్లు ఉన్నాయని, ఈనెల 17 సాయంత్రం 5 గంటల లోపు మహబూబ్‌నగర్ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 9 నుంచి దరఖాస్తు ఫారాలు ఇస్తామన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

మిడ్జిల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందని ఆ పార్టీ జిల్లా నాయకుడు వెంకటయ్య అన్నారు. సోమవారం మండలంలోని వాడియాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు.

మంత్రి వాకిటి శ్రీహరికి సన్మానం

పాలమూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మక్తల్ ఎమ్మెల్యే వాకటి శ్రీహరికి మంత్రి పదవి రావడంతో తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

సహాయ ఉపకరణాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ ద్వారా జిల్లాలోని దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు అందిస్తున్నామని, ఇందుకోసం అర్హత కలిగిన దివ్యాంగుల దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి జరీనా బేగం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వారి అవసరాన్ని బట్టి ఉపకరణాలు అందజేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మిడ్జిల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మిడ్జిల్‌కు చెందిన ఓ దినపత్రిక విలేకరి రాఘవేందర్‌రెడ్డికి గాయాలయ్యాయి. వాడియాల నుంచి మిడ్జిల్‌కు బైక్‌పై వెళ్తుండగా కారు ఢీ కొనడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు వివరాలు సేకరించారు.

సేంద్రియ వ్యవసాయంపై.. అవగాహన అవసరం

» పాలెం వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డా.భరత్‌భూషణ్


అవగాహన సదస్సులో పాల్గొన్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

పాలమూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : రైతులు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి. ఇందుకోసం వ్యవసాయ శాఖ అధికారులను కలిసి సూచనలు, సలహాలు తీసుకోవాలని పాలెం వ్యవసాయ పరిశోధన కేంద్రం డా.భరత్‌భూషణ్ రైతులకు సూచించారు. సోమవారం ఎదిర రైతువేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధానంగా రైతులు యూరియా వాడకం, పంటమార్పిడి, నీటియాజమాన్యం, విత్తనాల కొనుగోళ్లలో తీసుకోవల్సిన జాగ్రత్తలు, సేంద్రియ వ్యవసాయం, చెట్ల పెంపకంపై అవగాహన కల్పించారు. చౌడు పొలాల యాజమాన్యం, సమగ్ర వ్యవసాయ విధానం పైన ఏడీఏ శ్రీనివాసులు అవగాహన కల్పించారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డా.రాంప్రసాద్, ఏఈవోలు నవీన్‌కుమార్, సునీత పాల్గొన్నారు.

● మూసాపేట : రైతులు నూతన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి పొందవచ్చని శాస్త్రవేతలు డా.కె.సదయ్య, డా.వి.దివ్యరాణి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని జానంపేట రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేతలు అనే కార్యక్రమానికి వారు పాల్గొని మాట్లాడారు. కొత్తగా వస్తున్న సాంకేతిక అంశాలతో పాటు అధిక దిగుబడి వచ్చే వంగడాలపై రైతులకు వివరించారు. ఏవో అనీల్‌కుమార్, పశువైద్యాధికారి సింధూజ, ఏఈవోలు సురేష్, శివ, శశిత, అనిత పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య : ఆర్జేడీ


నవాబ్‌పేటలో నిర్వహించిన బడిబాటలో పాల్గొన్న ఆర్జేడీ విజయలక్ష్మి

నవాబ్‌పేట/జడ్చర్ల/గండీడ్/దేవరకద్ర/కోయిలకొండ/భూత్పూర్/బాలానగర్/మూసాపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతోందని విద్యాశాఖ ఆర్జేడీ విజయలక్ష్మి అన్నారు. సోమవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో కేజీబీవీని సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. కేజీబీవీల్లో కావల్సిన వసతులు ఉన్నాయని విద్యార్థులు మంచి మార్కులు తీసుకురావాలని కోరారు. ఎంపీడీవో జయరాములు, ఎంఈవో నాగ్యనాయక్ పాల్గొన్నారు. జడ్చర్ల మునిపాలిటీలోని జడ్చర్ల, కావేరమ్మపేట ప్రాంతాల్లో జడ్చర్ల ఎంఈవో మంజులాదేవి ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలుకాలనీల్లో ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికి వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. నాగసాల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించారు. గండీడ్ మండల కేంద్రంతో పాటు జక్లపల్లి, చెలిమిళ్ల, చిన్నవార్వల్, జంగంరెడ్డిపల్లి, రుసుంపల్లి, ఆశిరెడ్డిపల్లి గ్రామాల్లో ఇన్‌చార్జి ఎంఈవో జనార్దన్ ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. హెచ్‌ఎంలు బాబు, అనురాధ, కృష్ణారెడ్డి, చంద్రకాంత్, పాల్గొన్నారు. దేవరకద్ర మండల కేంద్రంతో పాటు నాగారం గ్రామంలో ఎంఈవో బాల్‌రాం ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం చేపట్టారు. కోయిలకొండ మండల కేంద్రంలో ఎంఈవో వెంకట్‌జీ, భూత్పూర్ మండల కేంద్రంలో సీఆర్పీలు విక్రం, నాగేందర్, ఠాకూర్ ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. బాలానగర్ మండలం అమ్మపల్లి, అప్పాజీపల్లి, బోడగుట్టతండా, గౌతాపూర్ గ్రామాల్లో ఎంఈవో శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. అడ్డాకుల మండలం పొన్నకల్ గ్రామంలో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



తిమ్మాయిపల్లిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న తహసీల్దార్ శేఖర్

జడ్చర్ల/మూసాపేట/దేవరకద్ర/హన్వాడ/భూత్పూర్/నవాబ్‌పేట/గండీడ్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్‌రావు అన్నారు. మండలంలోని చిట్టబోయిన్‌పల్లిలో తహసీల్దార్ నర్సింగ్‌రావు, పెద్దఆదిరాలలో నయాబ్ తహసీలార్ కిశోర్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. అడ్డాకుల మండలం తిమ్మాయిపల్లి తహసీల్దార్ శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు రెవెన్యూ సదస్సుకు 75 దరఖాస్తులు వచ్చాయి. నయాబ్ తహసీల్దార్ ఖాలీద్ బీన్ ఏక్బాల్, గిర్దావర్లు సృజన్‌కుమార్, శశివర్ధన్ పాల్గొన్నారు. దేవరకద్ర మండలం డోకూర్, నాగారం గ్రామాల్లో తహసీల్దార్ కృష్ణయ్య, డీటీ దీపిక ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 46 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఆర్‌ఐ శరత్‌కుమార్ పాల్గొన్నారు. హన్వాడ మండలం బుద్దారంలో తహసీల్దార్ కిష్యానాయక్, గుడిమల్కాపూర్‌లో డీటీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భూత్పూర్ మండలంలోని కొత్తూరు, రావులపల్లి గ్రామాల్లో తహసీల్దార్ కిషన్‌నాయక్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా, 36 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. ఆర్‌ఐలు వెంకటేష్, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు. నవాబ్‌పేట మండలం లింగంపల్లి, కాకర్జాల గ్రామాల్లో తహసీల్దార్ శ్రీనివాసులు, డీటీ సువర్ణ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సుల్లో 15 ఫిర్యాదు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. గండీడ్ మండలం పగిడ్యాల్, రంగారెడ్డిపల్లి గ్రామంలో తహసీల్దార్ మల్లిఖార్జున్‌రావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు కొనసాగాయి. పగిడ్యాల్‌లో నెట్ లేక రెవెన్యూ సిబ్బంది ఇబ్బంది పడ్డారు.

మునిసిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి


8వ వార్డులో పర్యటిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

భూత్పూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ అభివృద్ధికి ప్రతీ ఒక్కరు సహకరించాలని మునిసిపల్ కమిషనర్ నురూల్ నజీబ్ అన్నారు. 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా సోమవారం మునిసిపాలిటీలోని 8వ వార్డులో సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు పరిసరాలతో పాటు వ్యక్తి పరిశుభ్రత పాటించాలన్నారు. అదే విధంగా వార్డుల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, మంచి నీటి సౌకర్యం వంటివి సక్రమంగా ఉన్నాయా? అని అడిగారు. అవసమున్న చోట సీసీ రోడ్లు, డ్రైనేజీలు వెంటనే నిర్మించడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు పద్మ, వైద్యాధికారి అబ్దుల్ రబ్, పవన్‌కుమార్, మశ్చందర్, నరేందర్, పరశురాం పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మిడ్జిల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మక్తల్ ఎమ్మెల్యే వాకిట శ్రీహరికి మంత్రి వర్గంలో చోటు కల్పించడంతో మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు సోమవారం సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు అల్వాల్‌రెడ్డి, ఎడ్ల శంకర్, మల్లికార్జున్‌రెడ్డి, వెంకటయ్య, రమేష్, వెంకటయ్య ముదిరాజ్, జహీర్, హస్నన్, జంగయ్య, శంకరయ్య, మల్లయ్య ఉన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం


నృత్యం చేస్తున్న చిన్నారులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : భారతదేశంలో ఉన్న సంస్కృతి సంప్రదాయాలు ప్రపంచానికి దేశ గొప్పతనాన్ని చాటేలా చేస్తున్నాయని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి పట్టణంలోని దీప్తి శాస్త్రీయ నృత్య కళాశాల వేసవి శిక్షణా శిబిరం ముగింపు సమావేశం బాదం రామస్వామి సరోజాదేవి ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు. మాజీ మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్, మాజీ వైస్ షబ్బీర్ అహ్మద్, లయన్ నటరాజ్, మద్ది యాదిరెడ్డి, బాగన్న గౌడ్, నిర్వాహకులు వెంకటేష్, డాక్టర్ దీప్తి పాల్గొన్నారు.

నేటి నుంచి అమ్మమాట.. అంగన్‌వాడీ బాట

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని గ్రామాల్లో నేటి నుంచి అమ్మమాట.. అంగన్‌వాడీ బాట అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి జరీనాబేగం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10 నుంచి 17 వరకు బడిబాట కార్యక్రమం ఉంటుందని, ఇందులో భాగంగా 3 సంవత్సరాల పైబడిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, పిల్లల తల్లిదండ్రులు ఇందుకు సహకరించాలని కోరారు. అదేవిధంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, స్వయం సహాయక బృందాలతో కమిటీలను ఏర్పాటు చేసి వారితో ఊరేగింపు చేయాలన్నారు. 10న అంగన్‌వాడీ కేంద్రాలను అలంకరించాలని, తల్లిదండ్రులు, పిల్లలతో, ఎన్నుకోబడిన కమిటీలతో సమావేశం ఏర్పాటు చేయాలని, 11న మూడేళ్లలోపు పిల్లలను గుర్తించి అంగన్‌వాడీలో చేర్పించాలని, అంగన్‌వాడీల్లో చదివిన పిల్లలకు ధ్రువపత్రాలు ఇవ్వాలని, 12, 13, 16న పోషన్ వాటిక, కిచెన్ గార్డెన్ అభివృద్ధి, లబ్ధిదారులకు ఆహార పోషకాల గురించి వివరించాలని, 17న పూర్వ ప్రాథమిక విద్య గురించి తెలియజేయడంతో పాటు సామూహిక అక్షరాభ్యాసం చేయించాలన్నారు.

ఎంఈవోను విధుల నుంచి తొలగించాలి


డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న రమేష్‌గౌడ్

భూత్పూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండల విద్యాశాఖ అధికారి ఉషారాణిని వెంటనే విధుల నుంచి తొలగించాలని తెలంగాణ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం డీఈవో ప్రవీణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. మండల కేంద్రంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాల విద్యా సంస్థల పేర్ల ముందు టెక్నో, టాలెంట్, గ్రామర్ అంటూ చట్టానికి విరుద్ధంగా ప్రకటనలు చేస్తున్నారని ఎంఈవోకు పలు మార్లు వినతిపత్రం పత్రాలు ఇచ్చినా పట్టించుకోకుండా ప్రైవేట్ విద్యా సంస్థలకు కొమ్ముకాస్తున్నారని రమేష్‌గౌడ్ ఆరోపించారు. అదే విధంగా ఐఐటీలు, నీట్, సీబీఎస్ఈ వంటి విద్యాభ్యాసం అందిస్తామని గొప్పలు చెప్పుకొనే విధంగా బహిరంగ ప్రకటనలు చేస్తున్నా ఎంఈవో పట్టించుకోవడం లేదన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ పరిశీలన

జడ్చర్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీలోని సరస్వతీనగర్ కాలనీలో ఐదు రోజుల క్రితం విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం విద్యుత్‌శాఖ డీఈ చంద్రమౌళి పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, రూరల్ ఏఈ వెంకటయ్యను ఆదేశించారు. కౌన్సిలర్ సతీష్, విద్యుత్‌శాఖ టౌన్ ఏఈ ఎర్రన్న, లైన్‌మెన్‌లు భాస్కర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

వెస్ట్ డివిజన్ మండల కమిటీ ఎంపిక

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : వెస్ట్ డివిజన్ మండల కమిటీ సభ్యులను బీజేపీ జిల్లా కమిటీ ఎంపిక చేసింది. ఈ మేరకు సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్ కమిటీ అధ్యక్షుడిగా బాలీశ్వరి, ఉపాధ్యక్షులుగా రమేష్, భానుప్రకాశ్, సురేశ్‌చారి, మహేశ్, ప్రధాన కార్యదర్శులుగా నర్సింహ్మ, మహేశ్, కార్యదర్శులుగా జ్ఞానేశ్వర్, పొట్ల మల్లేశ్, గడిగె రాఘవేందర్, సునిత ఎంపికైనట్లు తెలిపారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన కార్పొరేషన్లలో భాగంగా పాలమూరు కార్పొరేషన్‌ను పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఈస్ట్, నార్త్, వెస్ట్, సౌత్‌లుగా విభజించిందని, అందుకు మండల కమిటీలను ఏర్పాటు చేసి సభ్యులను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, నాయకులు అంజయ్య, పోతుల రాజేందర్‌రెడ్డి, చిన్న వీరయ్య, పద్మవేణి, నారాయణ యాదవ్ పాల్గొన్నారు.

సివిల్ వివాదాల్లో పోలీసుల జోక్యం

» ఎస్పీకి ఫిర్యాదుల వెల్లువ » ప్రజా ఫిర్యాదులకు 25 వినతులు


ఫిర్యాదులు పరిశీలిస్తున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : సివిల్ వివాదాల్లో పోలీసుల జోక్యం పెరిగిపోతుంది.. ఇటీవల సివిల్ వ్యవహారంలో పోలీసుల తీరుపై హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదులు వెళ్లగా ఓ హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్‌కు గురయ్యారు. అయినా పోలీసులు సివిల్ వ్యవహారాల్లో తలదూరుస్తూనే ఉన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 25 ఫిర్యాదులు రాగా, అందులో పోలీసులు సివిల్ వ్యవహారాల్లో జోక్యం చేసుకుని తమను ఇబ్బంది పెడుతున్నారన్నవే ఎక్కువగా ఉండటం గమనార్హం. మూసాపేట మండలం పోల్కంపల్లికి చెందిన సిరాజొద్దీన్‌తోపాటు పలువురు రైతులు ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వేనెం 484లో 8.03 ఎకరాల భూమి ఉంది. అయితే దీనిపై ఏడీ సర్వే చేసుకుని హద్దులు నిర్ణయించుకున్నా.. తమ దాయాదులు తమకు భూమి తక్కువగా ఉందని గొడవ పడుతున్నారన్నారు. హద్దులు ప్రకారం తాము భూమి దున్నితే వారు అడ్డుకుంటున్నారని, మండల పోలీసుల ద్వారా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. ఎస్పీ పోలీసు అధికారులకు ఫోన్ చేసి సివిల్ విషయాల్లో అనవసరమైన జోక్యం ఉండకూడదని హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకున్న ఎస్పీ సంబంధిత అధికారులతో మాట్లాడి, పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు.

శాస్త్రీయంగా డివిజన్ల పునర్విభజన

» ఈనెల 11 వరకు అభ్యంతరాలు.. 16 వరకు పరిశీలన

» కార్పొరేషన్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి


మాట్లాడుతున్న కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు కార్పొరేషన్‌లో డివిజన్ల పునర్విభజన ప్రక్రియ శాస్త్రీయంగా చేయడం జరిగిందని ఇంకా ఏమైనా అభ్యంతరాలు, సలహాలు ఇస్తే వాటిని పరిశీలించి విచారణ చేస్తామని కార్పొరేషన్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. జనవరి 27న పాలమూరు మునిసిపాలిటీని కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేయడం జరిగిందని, ఇందులో దివిటిపల్లి, జైనల్లీపూర్ గ్రామాలను విలీనం చేసినట్లు తెలిపారు. ఇది వరకు 49 వార్డులుండగా 60 డివిజన్లకు పెంచి డివిజన్ల విభజనకు మే 29న షెడ్యూల్ విడుదల చేయడం జరిగిందని, దీని ప్రకారం ఈనెల 3న డ్రాఫ్ట్ నోటిఫికేషన్ పత్రిక ద్వారా విడుదల చేశామన్నారు. దీని ప్రకారం ఈనెల 11 వరకు విడుదల చేసిన ముసాయిదాపై ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తామని, వచ్చిన అభ్యంత రాలను ఈనెల 16 వరకు పరిశీలించడం జరుగుతుందన్నారు. ఆ తరువాత రెండు రోజులు కలెక్టర్ అనుమతికి పంపించి సీడీఎంఏకు పంపిస్తామన్నారు. 21న ఫైనల్ నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందన్నారు. నగరంలో 1.96 లక్షల మంది ఓటర్లు ఉండగా, 60 డివిజన్‌లకు సగటున 3,200 మంది ఓటర్లు వస్తున్నారని, దీనికి 10 శాతం ప్లస్ లేదా మైనస్ ఉంటుందన్నారు. నిబంధనల ప్రకారం నార్త్ నుంచి ఈస్ట్, వెస్ట్, సౌత్ క్లాక్ పద్ధతిలో డివిజన్‌లను తీసుకోవడం జరిగిందన్నారు. సరిహద్దులు నేషనల్ హైవే రోడ్లు, నాలాలు, రైల్వేట్రాక్ ఉంటే రోడ్డు అవతల భాగాన్ని ఒక డివిజన్‌గా ఇవతలి భాగాన్ని మరో డివిజన్‌లో కలిపామన్నారు. పూర్తి పారదర్శకత తో డివిజన్‌ల ప్రక్రియ జరిగిందన్నారు.

మోదీ పాలనను ప్రజలకు వివరించాలి


మాట్లాడుతున్న రాష్ట్ర నాయకురాలు పద్మజారెడ్డి

హన్వాడ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని మోదీ పాలనను ప్రజలకు వివరించాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు పద్మజారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ పాలన 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం హన్వాడలో మండల అధ్యక్షుడు కొండ లింగన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె పాల్గొని, మాట్లాడారు. రాష్ట్రంలో మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పేదలను అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. త్వరలో జరిగే స్థానిక సంస్థ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కార్యకర్తలు కలసికట్టుగా పనిచేయాలని కోరారు. అనంతరం మండల కమిటీని ప్రకటించి, సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ వడ్ల శేఖర్, మాజీ మండల అధ్యక్షుడు డాక్టర్ వెంకటయ్య, నాయకులు రమణారెడ్డి, వేణు పాల్గొన్నారు.

'అమెరికా జోక్యం సహించం'

పాలమూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ అంతరంగిక విషయాల్లో అమెరికా జోక్యం సహించమని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం జిల్లా స్థాయి క్యాడర్ క్లాసులను ప్రారంభించి, మాట్లాడారు. భారత అంతరంగిక వ్యవహారాల్లో అమెరికా జోక్యం మితిమీరిపోయిందని, భారత్-పాకిస్తాన్ యుద్ధం విషయంలో ట్రంప్ ఏక పక్షంగా యుద్ధ విరమణ జరిగిందని ప్రకటిస్తే మోదీ నోరు మెదపడం లేదన్నారు. కశ్మీర్ సమస్యను అంతర్జాతీయ సమస్యగా అమెరికా చిత్రీకరిస్తుందని, దీన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. పహల్గాం ఘటనలో దోషులను నేటికీ అరెస్టు చేయకపోవటం మోదీ వైఫల్యానికి నిదర్శనమన్నారు. మూడు రోజుల రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కోరారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ చరిత్రను సీపీఎం జిల్లా నాయకుడు కిల్లెగోపాల్, గతి తార్కిక పని పద్ధతులు అనే అంశాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ బోధించారు. నల్లవెల్లి కురుమూర్తి ప్రిన్సిపాల్‌గా వ్యవహరించగా, పద్మ, మోహన్‌జగన్, ప్రశాంత్, చంద్రకాంత్, రాజ్‌కుమార్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

డిజిటల్ సర్వేకు రైతులు సహకరించాలి


డిజిటల్ సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

గండీడ్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి సర్వేలో భాగంగా డిజిటల్ సర్వేకు రైతులు సహకరించాలని అదనపు కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని సాలర్‌నగర్ భూ భారతి పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన గ్రామ శివారును డ్రోన్ కెమెరాతో డిజిటల్ సర్వేను ప్రారంభించి, మాట్లాడారు. జిల్లాలోనే సాలర్‌నగర్‌ను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం జరిగిందని, మిగతా గ్రామాలు కూడా డిజిటల్ సర్వే చేయనున్నట్లు తెలిపారు. ఏడీ కిషన్‌రావు, సర్వే ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని స్టేట్ టీచర్స్ యూనియన్ కార్యాలయంలో జిల్లా ద్వితీయ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న జడ్పీ జీపీఎఫ్, మెడికల్ అండ్ సరెండర్ బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. సమ్మర్ వకేషన్‌లో ట్రైనింగ్ చేసిన, బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు ఈఎల్స్ మంజూరు చేయాలని కోరారు. వేసవిలో శాశ్వత క్యాలెండర్ ప్రకటించి ఏటా బదిలీ, పదోన్నతులు నిర్వహించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తహెర్, రాష్ట్ర కార్యదర్శి శశిధర్, జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు గౌడ్, మల్లికార్జున్, రాఘవేందర్, శ్రీనివాసులుగౌడ్, ఆంజనేయులు, మురళి, నాగేంద్ర, గోపాల్ పాల్గొన్నారు.

విద్యారంగంపై నిర్లక్ష్యం వీడాలి : డీటీఎఫ్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం విద్యారంగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ రేష్నలైజేషన్ ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ లాటి అసంబద్ధ విధానాలను విద్యారంగంలో ప్రవేశపెట్టడం సమంజసం కాదని, ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య, ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో విఫలమైందని, వచ్చే విద్యా సంవత్సరం నాటికి ప్రభుత్వ పాఠశాల విద్యా ప్రమాణాలను పెంచాలని డిమాండ్ చేశారు. విద్యా రంగానికి 20 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా, కేవలం 7.57 శాతం నిధులు మాత్రమే కేటాయిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీశైలం, జిల్లా అధ్యక్షుడు రవీందర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.